పగటి దొంగలు?

టెంపోరావ్

రాజాచంద్ర ఆ యింటిముందు ఆగాడు. అతడి చేతిలో నల్లటి ప్లాస్టిక్ బ్యాగ్ వుంది.

భయపడుతూ అతడు తెరచివున్న గుమ్మంవైపు చూశాడు. గురవయ్యశెట్టి దొంగ వస్తువులను కొంటాడని అతడు విన్నాడు. అది ఎంతవరకు నిజమో అతడికి తెలియదు.

రాజాచంద్ర మెల్లిగా ముందు హాల్లోకి వెళ్ళాడు. పడక కుర్చీలో గురవయ్యశెట్టి కూర్చుని వున్నాడు. శెట్టి వయస్సు అరవై దాటి వుంటుంది. పంచ, జుబ్బాలో వున్నాడతను. బొగ్గు నలుపు. పొట్టిగా లావుగా వున్నాడు.

అతడు రాజాచంద్రవైపు సూటిగా చూశాడు.

"ఏం కావాలి?" అడిగాడతను.

"నా దగ్గర విలువయిన వస్తువులున్నాయి. అమ్మడానికొచ్చాను."

అతడివైపు తదేకంగా చూశాడు శెట్టి. అతడు యువ

కుడు. వయస్సు ఇరవై వుండొచ్చు. పచ్చగా, అందంగా వున్నాడు. పాంట్, స్లాక్ ధరించాడు. కాళ్ళకు బూట్లు వున్నాయి.

"చూపించు!" అన్నాడు శెట్టి అధికార ధోరణిలో.

రాజాచంద్ర తన ప్లాస్టిక్ బాగ్‌లోని వస్తువులను నేల మీద పడేశాడు. కొన్ని వెండిపాత్రలు, ఒక వాచ్, ఒక ట్రాన్‌సిస్టర్, ఒక స్టెతస్కోప్.

"ఏ డాక్టర్ యింట్లోనుంచో యివన్నీ కొట్టేసి వుంటావు!"

రాజాచంద్ర మాట్లాడలేదు. మౌనంగా వున్నాడు. గురవయ్యశెట్టి నేలమీద వస్తువులను పరీక్షించాడు. వాటి విలువ వెయ్యిపైగా వుంటుంది.

"వీటికి రెండువందలిస్తాను" అన్నాడు శెట్టి.

రాజాచంద్ర వులిక్కిపడ్డాడు.

"చాలా తక్కువ!" అన్నాడతను.

"ఇదంతా దొంగసొత్తు. దొంగసొత్తును అమ్మడంలో ఎన్నో ప్రమాదాలున్నాయి. అంతకంటె యివ్వలేను!"

"ఇవ్వండి," అన్నాడు రాజాచంద్ర.

తనకు డబ్బు అర్జంటుగా కావాలి. ఎంతొచ్చినా ఫర్వాలేదు. శెట్టి డబ్బును వెంటనే యివ్వలేదు. అతడి వైపు సూటిగా చూశాడు.

"నువ్వు ఎక్కడ వుంటున్నావు?"

రాజాచంద్ర భయపడ్డాడు. తన య్రెడ్రెస్ అతడి కెందుకు? తనని పోలీసులకు అప్పగిస్తాడా?

"నా ఎడ్రెస్ చెప్పను," అన్నాడతను.

"మిస్టర్, నన్ను నీ శత్రువుగా భావించకు. నేను నీ

మిత్రుడిని. నీ గురించి యెప్పుడూ యెవ్వరికీ చెప్పను. కాని నువ్వు ఎవరో, ఎక్కడుంటున్నావో నాకు కావాలి. యిటు పైగా నువ్వు దొంగిలించే వస్తువులన్నీ నాకే అమ్మాలి!"

క్షణకాలం రాజాచంద్ర ఆలోచిస్తూ వుండిపోయాడు.

"నా పేరు రాజాచంద్ర. నేను నెంబర్ 10, మురుగమ్మన్ వీధిలో వుంటున్నాను."

"నీతో ఎవరుంటున్నారు?"

"అమ్మ నాతో వుంటోంది. ఆమె తప్ప నాకెవ్వరూ లేరు."

"ఆమె పేరు?"

"మంగమ్మ."

గురవయ్యశెట్టి కుర్చీలోంచి లేచాడు. ఇనప్పెట్టె వైపు వెళ్ళాడు. ఇనప్పెట్టెను తెరిచి రెండు వందలయాభై రూపాయలు రాజాచంద్రకు యిచ్చాడు.

"నేను చెప్పిందానికంటె యాభై ఎక్కువిస్తున్నాను. నువ్వు సంతోషంగా వెళ్ళాలని నా వుద్దేశం," అన్నాడు శెట్టి.

రాజాచంద్ర సంతోషించాడు. నోట్లను పాంటు జేబులో దాచుకున్నాడు. "చాలా థాంక్స్. వెళ్ళొస్తాను సార్," అన్నాడతను.

"రాజా! దొంగతనాలు చేసేటప్పుడు జాగ్రత్తపడు! నువ్వు ఎన్నడూ పోలీసులకు చిక్కకూడదు. నువ్వు ఎప్పుడేం తెచ్చినా నేను కొంటాను. నువ్వు ఒకవేళ పట్టుబడితే, నా పేరు ఎప్పుడూ చెప్పకూడదు!"

"చెప్పను," అన్నాడతను.

6

"అనేకమంది అలాగే అంటారు. పోలీసులు చావ గొడ్తే నిజం చెప్పేస్తారు" అన్నాడు శెట్టి.

రాజాచంద్ర నవ్వాడు.

"నేను పట్టుబడను. నన్ను హింసించే అవకాశం పోలీసులకు దొరకదు. మీకు బెంగ అనవసరం," అన్నాడు అతను.

"గుడ్, అలాగే వుండాలి" అన్నాడు గురవయ్య శెట్టి.

2

కమల, విమల రోడ్డమ్మట నడుస్తున్నారు. ఇద్దరూ నల్లగా వున్నారు. ఓసారి వాళ్ళనుచూస్తే మళ్ళా అటు వైపు చూడ బుద్ధికాదు. ఇద్దరి చేతుల్లోనూ పెద్దబాగ్స్ వున్నాయి.

వాళ్ళు ఒక ఇంటిముందు ఆగి, మెల్లిగా లోపలకు వెళ్ళారు. ముందు తలుపు గుమ్మం యెదుట నిలబడి తలుపును తట్టారు. రెండు నిమిషాల తర్వాత తలుపు తెరవబడింది. బంగారమ్మ వాళ్ళవంక చూసింది.

బంగారమ్మ వూదారంగు చీర, రవిక వేసుకుంది. చేతికి అందమైన వాచ్ వుంది. ఆమె చాలా లావయిన మనిషి. చేతికి బంగారం గాజులు, వేలికొక వుంగరం వున్నాయి. ఆమె వయస్సు అరవై వుంటుంది. తెల్లటి జుత్తు.

"అమ్మాయిలూ, ఏం కావాలి?" అడిగిందామె.

"మేం రఘు అండ్ కంపెనీ తరఫున పనిచేస్తున్నాం. ఇంటింటికీ వెళ్ళి ఈ డిటర్జెంట్ వాషింగ్ పౌడరు అమ్ముతున్నాం" అంది కమల.

"నలుగురు మెంబర్లువున్న కుటుంబానికి కిలో పాకెట్ నెలరోజులు వస్తుంది. గుడ్డలు తెల్లగా వుంటాయి. మురికి మాయమవుతుంది," అంది విమల.

బంగారమ్మ వాళ్ళవైపు దయతో చూసింది. ఈ ఆడ పిల్లలు ఎండలో తిరుగుతున్నారు.

"మంచినీళ్ళు కావాలా?" అడిగిందామె.

"ఇవ్వండి బామ్మగారూ," అంది కమల.

"లోపలకొచ్చి కూర్చోండి. నీళ్ళు తెస్తాను," అని ఆమె లోపలకు వెళ్ళింది.

కమల, విమల హాల్లోకి వెళ్ళారు. ఇద్దరూ నలు వైపులా చూశారు. టేబుల్ మీద పెన్నుంది.

కమల టేబుల్ దగ్గరకెళ్ళింది. పెన్నును బాగ్‌లో పడేసుకుని సొరుగు లాగింది. లోపలున్న రిస్ట్‌వాచ్‌ని బాగ్‌లో వేసుకొని, విమల సంజ్ఞలు గుర్తించి వచ్చి కుర్చీలో కూర్చుంది.

బంగారమ్మ తెచ్చిన నీళ్ళు వాళ్ళు దాహంతో తాగేరు.

"చాలా థాంక్స్ బామ్మగారూ," అంది కమల.

"ఒక పాకెట్ కొనండి. వెల 10-50. మార్కెట్లో యిదే పాకెట్ 12-50 కి అమ్ముతున్నారు," అంది విమల.

"మనవడు లేడు. వాడుంటే తప్పక కొనమనేదాన్ని" అంది బంగారమ్మ.

"ఆయన ఎప్పుడు వస్తారు?" అడిగింది కమల.

"ఆరింటి కొస్తాడు" అందామె.

"మళ్ళా వస్తాం, బామ్మగారూ" అని వాళ్ళు బయటకు నడిచారు.

వాళ్ళు బయటకు వెళ్ళాక బంగారమ్మ తలుపుమూసి

గడియలు బిగించి తన బరువయిన శరీరాన్ని మెల్లగా పడగ్గదిలోకి చేర్చి, మంచంమీద వాలింది.

కమల, విమల ఆ రోడ్డులోని మరే యింటికి వెళ్ళలేదు. శరవేగంగా రోడ్డమ్మట నడచి వెళ్ళిపోయారు. రోడ్డు మలుపులో మోటర్ సైకిల్ పక్కనే రాజాచంద్ర నిలబడి సిగరెట్ పీలుస్తున్నాడు.

సమీపంలో ఎవ్వరూ లేరు. వాళ్ళు అతని పక్కనే ఆగారు. కమల తన బాగ్ లోంచి వస్తువులుతీసి అతడి బాగ్ లో పడేసింది. విమల మరికొన్ని వస్తువులు యిచ్చింది. అతడు బాగ్ ను మోటర్ సైకిల్ కి తగిలించుకొని వెళ్ళిపోయాడు.

వాళ్ళిద్దరూ వెనక్కి తిరిగారు, అదే రోడ్డులోని మరికొన్ని యిళ్ళకు వెళ్ళటానికి.

3

చిన్న యిల్లు.

పడగ్గదిలో రాజాచంద్ర కుర్చీలో కూర్చుని వున్నాడు. నేలమీద రెండు చాపలు పర్చివున్నాయి. వాటిమీద ఆరుగురు యువతులు కూర్చొని వున్నారు.

అతడు నవ్వుతూ వాళ్ళవైపు చూశాడు.

"మైడియర్ ఫ్రెండ్స్, ఇవాళ ఏడో తారీఖు. గత నెలలో మనం దొంగిలించిన వస్తువులకు మొత్తం మూడు వేలు వచ్చింది. మన అగ్రిమెంట్ ప్రకారం అందులో సగం నాది. మిగిలినది మీకు పంచేస్తున్నాను. ఒక్కొక్కళ్ళకి 250 వస్తుంది," అన్నాడతను.

వాళ్ళందర్కీ అతడు డబ్బు యిచ్చేశాడు. వాళ్ళ ముఖాలవైపు చూశాడు. ముగ్గురి ముఖాలు సంతోషంగా

వున్నాయి. కమల, హేమ, గాయత్రి ముఖాల్లో సంతోషం లేదు.

"మీరు ముగ్గురూ ఎందుకలా వున్నారు?" ప్రశ్నించాడతను.

"మా శ్రమకు వచ్చింది తక్కువ!" అంది కమల.

"దొంగిలించేది మేము. మాకింకా ఎక్కువ రావాలి," అంది గాయత్రి.

"నేనూ అలాగే అంటాను" అంది హేమ.

రాజాచంద్ర విల్స్ ఫిల్టర్ కింగ్ సైజు సిగరెట్ వెలిగించాడు. కోపంగా వాళ్ళవంక చూశాడు.

"మీ రందరూ గుడిసెల్లో జీవిస్తున్నారు. దమ్మిడీ ఆదాయం లేదు. మీకు నేను ట్రయినింగ్ యిచ్చి యీ పనిలోకి దింపాను. ప్రస్తుతం నెలకు 250 వస్తోంది. భవిష్యత్తులో యింకా ఎక్కువగా రావచ్చు. మీకు ప్రమాదం రాకుండా మీరు దొంగిలించిన వస్తువులను నేను వెంటనే తీసుకుపోతున్నాను - అయినా మీరు సంతోషించడం లేదు!" అర్చాడతను.

"గత మాసంలో మేం దొంగిలించిన వస్తువుల విలువ ఎంత వుంటుంది?" అడిగింది కమల.

"పన్నెండువేలు వుండొచ్చు?" అన్నాడతను.

"అదమ్మితే నీకు మూడువేలు మాత్రం వచ్చింది!" అంది కమల.

"గురవయ్యశెట్టి నీకు తక్కువిచ్చి నిన్ను మోసం చేస్తున్నాడు" అంది గాయత్రి.

"కనీసం సగం ధరకు నువ్వు అమ్మాలి" అంది హేమ.

"నేను ప్రయత్నించాను - గురవయ్యశెట్టి అంతకంటె యివ్వడు."

"ఇటుపైన అతడికి కమ్మొద్దు!" అంది గాయత్రి.

రాజాచంద్ర సిగరెట్ పొగ పీల్చి వదులుతూ వుండిపోయాడు. గురవయ్యశెట్టికి తను అమ్మితీరాలి. తన పేరు, అడ్రస్ అతడికి తెలుసు. మరెవరికేనా అమ్మితే గురవయ్యశెట్టి తనని కష్టాల్లో యిరకించవచ్చు!

ఇదంతా అతడు వాళ్ళకు వివరంగా చెప్పాడు.

"తెగించి దొంగతనం చేసేవాళ్ళం గురవయ్యశెట్టికి భయపడాలా?" అంది గాయత్రి.

"దొంగసొత్తును కొనేవాళ్ళు యీ పట్నంలో ఎందరో వున్నారు. వాళ్ళు యింకా ఎక్కువ యిస్తారు" అంది కమల.

"నీకు తెలిసినవాళ్ళు ఎవరేనా వున్నారా?" అడిగాడతను.

"ఉమాపతి వున్నాడు. అతడు ఎక్కువగా ఇస్తాడు" అందామె.

"ఈసారి అతడిదగ్గర కెళ్తాను" అన్నాడు రాజాచంద్ర.

గదిలోని యువతులందరూ వెళ్ళిపోయారు. రాజాచంద్ర బ్రాందీ సేవిస్తూ ఆలోచిస్తూ కూర్చున్నాడు. తను వుమాపతి దగ్గరకు వెళ్ళేముందు ఒకసారి గురవయ్యశెట్టితో మాట్లాడ్డం మంచిదనిపించింది.

గదిలోకి వచ్చిన తల్లివంక అతను నవ్వుతూ చూశాడు

"బాబూ, ఎలావుంది నీ వ్యాపారం?" అడిగిందామె.

"జయప్రదంగా నడుస్తోంది" అన్నాడతను.

మంగమ్మ మంచి మనిషి. ఆమె భర్త స్కూల్ మాస్టర్ గా పనిచేస్తూ హృద్రోగంతో మరణించాడు. బి.ఎ.

చదువుతూ రాజాచంద్ర చదువు మానేశాడు. ఎక్కడా వుద్యోగం దొరక్క, పెక్కు సినిమాలు చూసి నేర్చుకున్న యీ దొంగజీవితంలోకి దిగాడు.

అతడేం చేస్తున్నాడో తల్లికి నిజం తెలియదు. డిటర్జెంట్ సోప్ పాకెట్లు పంపిణీ చేస్తున్నాడని ఆమె అనుకుంటోంది.

రాజాచంద్ర గదిలోంచి బయటకు కదిలాడు.

తన మోటర్ సైకిల్ని గురవయ్యశెట్టి యింటివైపు పోనిచ్చాడు.

4

హాల్లో ఫ్లోరసెంట్ లైట్ ప్రకాశవంతంగా వెల్గుతోంది. గురవయ్యశెట్టి కుర్చీలో కూర్చుని వున్నాడు.

"రాజా, కూర్చో!" అన్నాడతను.

అతడికెదురుగా రాజాచంద్ర కూర్చున్నాడు. క్షణకాలం గదిలో నిశ్శబ్దంగా వుంది.

"మళ్ళాఏమైనా తెచ్చావా?"

"లేదు."

"నేనెలావున్నానో చూడ్డానికి వచ్చావంటే నమ్మను!" అన్నాడు గురవయ్యశెట్టి.

"పనిమీదే వచ్చాను."

"ఏమిటది?"

"ఇటుపైన దొంగవస్తువులను మీ కమ్మను."

"నీ యిష్టం" అన్నాడు శెట్టి.

"వుమాపతి సగం ధర యిస్తానన్నాడు" అన్నాడు రాజాచంద్ర.

"నువ్వతడిని కలుసుకున్నావా?"

12

"నా మనుషులు కల్సుకున్నారు."

గురవయ్యశెట్టి అతడి వంక ఆశ్చర్యంగా చూశాడు.

"నువ్వొక్కడివే యిదంతా చేస్తున్నావని ఇంతవరకూ అనుకున్నాను. నీకు సహచరులున్నారని యిప్పుడే వింటున్నాను!"

"వుంటే పోయిందేమిటి?"

అతడివంక సూటిగా చూశాడు శెట్టి.

"ఈనాడు నీతో చెయ్యి కలిపినవాళ్ళు తర్వాత నీ గుండెలమీద గుద్దుతారు!"

"ఆ భయం లేదు నాకు. నన్నెవరూ ఎదిరించరు!"

"రాజా, నీ విశ్వాసం గొప్పది. దాన్నిగురించి నేను ప్రస్తుతం ఏమీ చెప్పను. కాని వుమాపతి గురించి చెప్తాను. అతడు సగం ధర యిస్తానని వస్తువులను తీసుకుంటాడు. చివరకి పదో వంతుకూడా యివ్వడు. నిన్ను బ్లాక్ మెయిల్ చేసి, భయపెట్టి చౌకగా వస్తువులను కొట్టేస్తాడు. అతడి దగ్గరకెళ్ళిన వాళ్ళెందరో నా దగ్గరకు తిరిగి వచ్చారు" అన్నాడు గురవయ్యశెట్టి.

గురవయ్యశెట్టి చెప్పింది నిజమేమో! కమలకు ఉమాపతి విషయం బాగా తెలియదేమో! కొంతసేపు రాజాచంద్ర ఆలోచిస్తూ వుండిపోయాడు.

"మీరు యింకా ఎక్కువగా యియ్యగలరా?"

గురపయ్యశెట్టి పక్కనున్న టీపాయ్ వైపు చూశాడు. ప్లేటులో ద్రాక్షపళ్ళు, ప్లమ్స్ వున్నాయి. పళ్ళను తింటూ కొంతసేపు వుండిపోయాడు.

"రాజా, నీ కింతవరకూ నాల్గోవంతు యిస్తున్నాను. ఇటుపైన నీకు మూడోవంతు యిస్తాను. అంతకంటె అధి

కంగా యివ్వలేను. పోలీసులకు నేను మామూళ్ళివ్వాలి. దొంగ వస్తువులు నేను కొంటానని వాళ్ళకి తెలుసు. ఇవ్వ వలసింది యివ్వకపోతే నా యింటిమీద రెయిడ్ చేసి వాళ్ళంతా పట్టుకుపోతారు."

రాజాచంద్ర ఆలోచిస్తూ వున్నాడు. ఉమాపతి పేరు ఎత్తగానే గురవయ్యశెట్టి తనిచ్చే మొత్తాన్ని యెక్కువ చేశాడు. బేరం ఆడితే యింకా హెచ్చిస్తాడేమో!

"మూడోవంతుకు నా మనుషులు ఒప్పుకోరు!"

"ఎంతకు ఒప్పుకుంటారు?"

"వాళ్ళకు సగం ధర కావాలి,"

గురవయ్యశెట్టి ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాడు.

"నూరు రూపాయల విలువగల వస్తువులకు నలభై యిస్తాను. 40 పర్సెంట్. అంతకుపైన యివ్వను, యివ్వ లేను."

రాజాచంద్ర కుర్చీలోంచి లేచాడు. తన బేరం ఫలించింది. ఇప్పుడు తనకు ఎక్కువగా వస్తుంది. తనతో పని చేసేవాళ్ళు సంతోషిస్తారు.

"ఆల్ రైట్ సార్, ఆ విధంగా మీకు యిస్తాను," అని రాజాచంద్ర బయటకు వెళ్ళబోయాడు.

"రాజా!" పిల్చాడు గురవయ్యశెట్టి.

"నువ్వు మరెవ్వరికీ అమ్మలేవు! అమ్మితే నీ గురించి నేను పోలీసులకు చెప్తాను. నీమీద దాడిచేస్తారు!"

"నేను మరెవ్వరికీ అమ్మను" అన్నాడతను.

"అంత సులువుగా నన్ను వదలలేవు. అది గ్రహించు" అన్నాడు శెట్టి.

"తెలుసు" అని రాజాచంద్ర బయటకు పరుగెత్తాడు.

5

గాయత్రి, సుమతి రోడ్డమ్మట నడిచి ఒక యింటి ముందు ఆగారు. వీధి తలుపుమూసి వుంది. వాళ్ళు తలుపును తట్టారు.

వెంటనే తలుపు తెరవబడింది. గళ్ళలుంగీ, బనియన్‌లో వున్న కన్నబాబు వాళ్ళవంక నవ్వుతూ చూశాడు. అతడి తలమీద వెంట్రుకలు లేవు. తిరపతి వెళ్ళి బోడిగుండు చేయించుకొచ్చాడు. అతడి వయస్సు యిరవై ఐదు దాటి వుంటుంది. ఆడపిల్లలో మాట్లాడే అనుభవం అతడికంతగా లేదు.

ఎదురుగా నిలబడిన యువతులను చూడగానే అతడి గుండె దడదడలాడింది.

"ప్లీస్, లోపలకు రండి" అన్నాడతను.

వాళ్ళిద్దరూ హాల్లోకి వెళ్ళారు. ఇంట్లో అతడు తప్ప ఎవ్వరూ లేరు. నాన్న ఆఫీసుకు వెళ్ళాడు. అమ్మ పిండి మరకు పోయింది.

"నేను మీకు ఏం చేయగలను?" అడిగాడతను, ఖంగారుగా.

గాయత్రిమీద అతడి చూపు కేంద్రీకృతమైంది. ఆమె వయస్సు పద్దెనిమిది వుంటుంది. ఎర్రగా, బొద్దుగా వుంది. బిగువైన ఆమె స్తనాలు కొట్టొచ్చినట్లు పైకి కనిపిస్తున్నాయి, జాకెట్‌లోంచి!

"మేం రఘు అండ్ కంపెనీ తరఫున వచ్చాం. ఈ డిటర్జెంట్ వాషింగ్ సోప్ పౌడర్ను అమ్ముతున్నాం. కిలో పాకెట్ ధర 10.50. మార్కెట్‌లో యిది 12.50కి అమ్ముతున్నారు" అంది గాయత్రి.

"ఎన్ని కిలోలు నేను కొనాలి?" అన్నాడు కన్న బాబు.

"రెండు కిలోలు కొనండి" అంది సుమతి.

"రెండు నెలలుదాకా మీకు సరిపోతుంది" అంది గాయత్రి.

డబ్బు తేడానికి అతను లోపలకు వెళ్ళాడు. కన్న బాబు సదర్న్ పెయింట్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. నెలకు నాల్గువందలు జీతం వస్తుంది. తల్లికి మూడొందలిచ్చి వంద తన ఖర్చులకోసం వుంచుకుంటాడు.

అతడు తిరిగొచ్చేలోపల హాల్లోని వస్తువులను గాయత్రి తన బాగ్‌లో పడేసుకొంది. అతడొచ్చి యిరవై ఒక్క రూపాయలు వాళ్ళకిచ్చాడు. రెండు పాకెట్లు తీసు కొన్నాడు.

అతడు గాయత్రి వంక ఆత్రంగా చూశాడు.

"మీరు తరచూ మా యింటికి వస్తూ వుండాలి" అన్నాడతను.

"వస్తాం లెండి" అంది గాయత్రి.

వాళ్ళిద్దర్నీ బయటకు సాగనంపి అతడు తలుపు మూశాడు. అతడికి చాలా ఆనందంగా వుంది. గాయత్రి ముఖం అతడికి జ్ఞప్తికొస్తోంది. ఆమె అతడి కళ్ళకు చాలా అందంగా కనిపించింది.

అతడు హాల్లోని కుర్చీలో కూర్చున్నాడు. అతడిచూపు టేబుల్ మీదకు వెళ్ళింది. కాసెట్ టేప్ రికార్డర్ ఏమైంది? అది టేబుల్ మీద వుండాలి! దానికోసం అతడు అన్నిచోట్లా వెతికాడు. కాని కాసెట్ ఎక్కడా కనపడ లేదు!

వాళ్ళిద్దరూ దాన్ని పట్టుకుపోయారా? అనుమానం అత

డిని పీడించింది. అతడు వెంటనే బయటకెళ్ళి తలుపు మూశాడు. రోడ్డమ్మట వేగంగా కదలసాగాడు.

వాళ్ళు ఎక్కువ దూరం వెళ్ళివుండరు. వాళ్ళను తను పట్టుకోవచ్చు! అతడు వీధి చివరదాకా నడిచాడు. ఆ యువతులిద్దరూ అతడికి ఎదురయ్యారు. అతడాగి వాళ్ళ వైపు చూశాడు. గాయత్రి అతడిని చూసి తీయగా నవ్వింది.

ఆమెను అనుమానిస్తున్నందుకు అతడు విచారించాడు.

"మా హాల్లోని టేబుల్ మీద కాసెట్ టేప్ రికార్డర్ వుండాలి. అది లేదు" అన్నాడతను.

గాయత్రి ప్రక్కనున్న సుమతివంక చూసింది.

"సుమతీ, మన బాగ్స్ ఆయనకు చూపించు!" అందామె ఉక్రోషంగా.

వాళ్ళ చేతుల్లో వున్న రెండు బాగ్ లను తెరిచి చూపించారు. వాటిలో కాసెట్ లేదు. సోప్ పౌడర్ పాకెట్లు వున్నాయి.

"మిమ్మల్ని అనుమానించినందుకు నన్ను క్షమించండి! నాన్న కాసెట్ ని పట్టుకెళ్ళి వుంటాడు" అని అతడు వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు.

అతడు కొంచెం దూరం వెళ్ళాక గాయత్రి సుమతి చెయ్యిని పట్టుకుని నవ్వింది.

6

ఎదురుగా కూర్చున్న ఆర్గురు యువతులవైపూ అతడు చూశాడు. "గత మాసంలో మనం దొంగిలించిన వస్తువుల విలువ పదిహేను వేలు వుంటుంది. గురవయ్యశెట్టి రేటు హెచ్చించి 40% యిచ్చాడు. మనకు ఆరువేలు వచ్చింది.

నా వాటా పోగా, మీకు మూడు వేలు పంచుతున్నాను. తలో ఐదువందలూ వస్తుంది" అన్నాడతను.

అందరి మొహాల్లోనూ సంతోషం కనిపిస్తోంది.

"వుమాపతి ఎక్కువిస్తాడని మీరన్నారు. కాని అతడు మంచి మనిషి కాడని విన్నాను!" అని అతడు కమల వంక చూశాడు.

"సగం ధర అతడు యిస్తాడని విన్నాను. అది నీకు చెప్పాను" అంది కమల.

"అతడితో నీకు పరిచయముందా?"

"లేదు."

"పరిచయంలేని వాడికంటె బాగా పరిచయమున్న గురవయ్యశెట్టినే మనం నమ్మొచ్చు. ఎన్ని నెలలనుంచో శెట్టి నా దగ్గర వస్తువులను కొంటున్నాడు. నేను బేరం చేయగానే రేటు పెంచాడు! అతడే త్వరలో మనకు సగం ధర యివ్వొచ్చు!" అన్నాడతను!

"ఇసే బాగుంటుంది" అంది హేమ.

గాయత్రి అతడివంక సీరియస్‌గా చూసింది.

"ఈ దొంగతనాలు యిదే విధానంలో యింకా ఎంత కాలం చెయ్యగలం? తన కాసెట్ టేప్ రికార్డర్ కనపడ్డం లేదని కన్నబాబు మా వెనకనే పరుగెత్తుకొచ్చాడు. అదృష్టవశాత్తూ కాసెట్‌ను అప్పటికే నీకిచ్చేశాం. మా బాగ్స్ అతడికి ధైర్యంగా చూపించాం. దొంగిలించిన వస్తువులు నీకిచ్చే లోపల ఎవరేనా మా వెనక పడితే మేం చిక్కుకుపోతాం" అంది గాయత్రి.

"ఆ ప్రమాదం మీకు రాదు. మీరు బయటకొచ్చిన కాస్సేపటిదాకా వాళ్ళు కనుక్కోలేరు. ఈ లోపల నేను

అదే వీధి మలుపులో మీకోసం సిద్ధంగా వుంటాను. భయ పడకండి" అన్నాడతను.

గదిలో రెండు నిమిషాలపాటు నిశ్శబ్దంగా వుంది. రాజాచంద్ర సిగరెట్ వెలిగించి, పొగవదుల్తూ వాళ్ళ వంక చూశాడు.

"మిమ్మల్ని అనేక ప్రదేశాల్లో నేను తిప్పుతున్నాను. అందువలన ఎవ్వరూ మిమ్మల్ని అనుమానించే అవకాశం లేదు."

అతడు వాళ్ళకు డబ్బిచ్చాడు. అందరూ సంతోషంగా డబ్బును అందుకున్నారు. సుమతి అతడివైపు నవ్వుతూ చూసింది.

"ఇటుపైన నేను యీ పనికి రాను" అందామె.

"ఎందువలన?"

"రాజారామ్ అనే యువకుడితో నాకు పరిచయమైంది. మేం యిద్దరం ప్రేమించుకొంటున్నాం. ఈ వారంలో మా పెళ్ళి జరగబోతోంది."

"గుడ్ న్యూస్, సంతోషం. రాజారామ్ నీకెలా తటస్థ పడ్డాడు?" అడిగాడు రాజాచంద్ర.

"అతడింటికి మేం వెళ్ళాం. అతడి యింట్లోంచి రెండు వాచీలను కొట్టేశాం. తర్వాత మేం కల్సుకున్నాం. అతడు నన్ను గుర్తుపట్టాడు. నన్ను హోటల్స్‌కీ, బీచ్‌కీ తీసుకు వెళ్ళేవాడు. ఆ విధంగా మా ప్రేమ పెరిగింది" అంది సుమతి.

రాజాచంద్ర ఆమెవంక సూటిగా చూశాడు.

"అతడికి మా గురించి నువ్వు చెప్పొచ్చు!"

"ప్రాణం పోయినా చెప్పను" అందామె.

"నేను నమ్మలేను. నువ్వెలాగూ వెళ్ళిపోతున్నావు. నీ కిచ్చిన ఐదువందలు నాకు వాపసు చేయి. అతి తలిమా వాళ్ళకు పంచేస్తాను. భర్త దొరికినందుకు నువ్వు తృప్తి పడు!"

ఆమె తృళ్ళిపడింది.

"గత మాసంలో నేనూ పనిచేశాను. ఈ డబ్బు నాది" అందామె.

"మాతో వుంటే నీదే? మమ్మల్ని వదిలేస్తే నీది కాదు!" అన్నాడతను గంభీరంగా.

క్షణకాలం సుమతి ఆలోచిస్తూ వుండిపోయింది.

"నేను మిమ్మల్ని వదలను. పెళ్ళయినాకకూడా యీ పని చేస్తాను" అందామె.

"నీ భర్తకు యిదంతా చెప్పకూడదు!"

"చెప్పను" అందామె.

"చెప్తే నువ్వు ప్రమాదంలో పడ్తావు" హెచ్చరించాడతను, ఆమెవైపు భయంకరంగా చూస్తూ.

7

ఇన్‌స్పెక్టర్ శింగ్ వయస్సు ముప్ఫయి దాటింది. చాలా వుషారైన వ్యక్తి. పోలీస్ జీప్‌లోంచి దిగి అతడు లోపలకు వెళ్ళాడు. ముగ్గురు కానిస్టేబుల్సు జీప్ దగ్గర నిలబడ్డారు.

కమలాకర్ నవ్వుతూ యిన్‌స్పెక్టర్ని కూర్చోమన్నాడు.

"ఏమైందో చెప్పండి" అన్నాడు యిన్‌స్పెక్టర్ శింగ్.

కమలాకర్ వయస్సు నలభై దాటింది. అతడుకూర్చున్న కుర్చీ వెనక భార్య మధుమతి నిలబడి వుంది. కమలాకర్ ఐ.సి.ఎఫ్.లో వుద్యోగం చేస్తున్నాడు.

"నిన్న నేనూ, నా భార్యా మేటనీకి వెళ్ళాం. ఇంట్లో మా అమ్మా, యిద్దరు పిల్లలూ వున్నారు. ఆ టేబుల్ మీద రికో మిక్సర్ వుండాలి. అది మాయమైంది" అన్నాడు కమలాకర్.

"ఇంట్లో దానికోసం వెతికి చూశారా?" అడిగాడు శింగ్.

"అన్నిచోట్లా వెతికిచూశాం. ఎక్కడా లేదు. మేం ఎవ్వరికీ యివ్వలేదు" అన్నాడతను.

"మీరు నిన్నే ఎందుకు మాకు రిపోర్టివ్వలేదు?"

"మేం తిరిగొచ్చేసరికి ఎనిమిది దాటింది. తిండి తిని పడుకున్నాం. మిక్సర్ మాయమైనట్లు యివాళ పొద్దుటే కనుక్కున్నాం. వెంటనే మీకు ఫోన్ చేశాను, పక్కింటి లోంచి" అన్నాడతను.

"మీ అమ్మగార్ని యిలా రమ్మనండి!"

కమలాకర్ లోపలకు వెళ్ళలేదు. వెనకనున్న భార్య వైపు చూశాడు. ఆమె లోపలకు వెళ్ళి కాస్సేపట్లో ఒక వృద్ధురాలితో తిరిగి హాల్లోకొచ్చింది.

ఇన్‌స్పెక్టర్ శింగ్ ఆమె వంక పరీక్షగా చూశాడు. ఆమె వయస్సు అరవై పైన వుంటుంది. తెల్లచీర, రవిక వేసుకొంది. కళ్ళజోడును ధరించింది.

"మీరు ఇంట్లో వుండగా నిన్న ఎవరైనా వచ్చారా?"

"రాలేదండి" అందామె.

"టేబుల్ మీదున్న మిక్సర్ని మీరు చూశారా?"

"నేను చూశాను" అందామె.

"ఎవ్వరూ తీయకుండా అదెలా కదులుతుంది? జ్ఞాపకం తెచ్చుకోండి. ఎవరెవరు యింటికొచ్చారో చెప్పండి" అన్నాడు యిన్‌స్పెక్టర్.

ఆమె కాస్సేపు ఆలోచిస్తూ కుర్చీలో కూర్చుంది.

"మూడింటికి పాలపాకెట్ తెచ్చి పనిమనిషి యిచ్చి వెళ్ళిపోయింది. తర్వాత బాబీ వచ్చి అబ్బిగాడిని ఆటకు తీసుకుపోయాడు. ఇంట్లో నేనూ, రమా వున్నాం" అందామె.

"అబ్బిగాడు మా పెద్దబ్బాయి" చెప్పాడు కమలాకర్.

"రమా నిద్రపోతోంది. అప్పుడు యిద్దరు యువతులు వచ్చారు. వాషింగ్ సోప్ పౌడరు అమ్ముతున్నారు వాళ్లు, ప్రతి యింటికీ వెళ్ళి."

"మీరు కొన్నారా?"

"వాళ్ళను చూస్తే నాకు జాలివేసింది. కిలో పాకెట్ కొన్నాను. వాళ్ళకు 10.50 యిచ్చాను. వాళ్ళు వెళ్ళి పోయారు. తర్వాత మరెవ్వరూ రాలేదు" అందామె.

"ఆ యువతులు యిక్కడ ఎంత సేపు వున్నారు?"

"ఇలా వచ్చి అలా వెళ్ళిపోయారు! వాళ్ళకు మంచి నీళ్ళు యిచ్చాను. తాగి, నేనిచ్చిన డబ్బు తీసుకొని, నాకు నమస్కరించి వెళ్ళారు" అందామె.

"వాళ్ళు వెళ్ళిపోయాక మిక్సర్ టేబుల్ మీద వుందా?"

"నేను చూడలేదండి" అందామె.

"మీరు కొన్న పాకెట్ నాకు చూపించండి" అన్నాడు యిన్స్పెక్టర్ శింగ్.

మధుమతి లోపలకు వెళ్ళింది. ఒక పాకెట్‌ను తెచ్చి అతడి కిచ్చింది. పోలీథీన్ పాకెట్‌లో వాషింగ్ పౌడరు వుంది. పాకెట్ మీద ముద్రించిన పేర్లను యిన్స్పెక్టర్ శింగ్ జాగ్రత్తగా చూశాడు,

"వైట్ ఫోమ్ డిటర్జెంట్ వాషింగ్ పౌడరు, మాన్ ఫాక్చర్డ్ బై రఘురామ్ అండ్ కంపెనీ, సోల్ డిస్ట్రిబ్యూటర్స్ రఘు అండ్ కంపెనీ" అని పాకెట్ మీద ముద్రించి వుంది.

ఇన్ స్పెక్టర్ శింగ్ ఆ కంపెనీల పేర్లను తన డైరీలో రాసుకున్నాడు.

"ఆ యువతులు మీతో ఏం చెప్పారు?"

"ఆ కంపెనీ తరఫున పని చేస్తున్నామన్నారు. సోప్ పౌడరు పాకెట్ చూపించారు. దయదల్చి ఒక పాకెట్ కొన్నాను" అందామె.

"మీరు మంచినీళ్ళు తేడానికి వెళ్ళినప్పుడు వాళ్ళిద్దరూ యీ గదిలో వున్నారా?"

"ఈ హాల్లోవాళ్ళు కూర్చున్నారు. చెంబుతో నేను తెచ్చిన నీళ్ళను పూర్తిగా తాగేశారు. పాపం, యెంత దాహమో! ఆ వయస్సులో వున్న ఆడపిల్లలకు మా కాలంలో పెళ్ళిళ్ళు అయిపోయేవి. రోజులు మారాయి. ఇప్పుడు వాళ్ళు సోప్ పౌడరు అమ్ముతూ వీధులమ్మట తిరుగుతున్నారు," అందామె.

"మీరు వెళ్ళి విశ్రాంతి తీసుకోండి" అన్నాడు యిన్ స్పెక్టర్.

ఆమె మధుమతితో లోపలకు వెళ్ళిపోయింది. ఇన్ స్పెక్టర్ శింగ్ కమలాకర్ వంక చూశాడు.

"మీరు మాకు రిపోర్టు రాసి యివ్వండి. మేం దర్యాప్తు చేస్తాం."

కమలాకర్ వివరంగా రిపోర్టురాసి యిన్ స్పెక్టర్ కి యిచ్చాడు.

రిపోర్టును తీసుకుని ఇన్‌స్పెక్టర్ శింగ్ జీప్‌లో కూర్చు న్నాడు. పది నిమిషాల్లో జీప్ పోలీస్ స్టేషన్‌కు చేరు కుంది.

ఇన్‌స్పెక్టర్ శింగ్ తన కుర్చీలో క్షణకాలం కూర్చు న్నాడు. అతడి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి. టెలిఫోన్ డైరక్టరీ చూసి అతడు రఘు అండ్ కంపెనీ నెంబర్ని రాసుకున్నాడు. ఆ నెంబర్కి ఫోన్ చేశాడు.

"రఘు అండ్ కంపెనీ" అందొక స్త్రీకంఠం అటు వైపు నుంచి.

"ఇన్‌స్పెక్టర్ శింగ్ హియర్! మీ కంపెనీ యజ మానితో మాట్లాడాలి!" అన్నాడతను.

"హోల్డాన్ సార్" అందామె.

కాస్సేపట్లో ఒక పురుషకంఠం అటువైపునుంచి విన పడింది. "ఐయామ్ జయరామ్, యీ కంపెనీ యజ మానిని" అన్నాడతను.

"మిస్టర్ జయరామ్, వైట్ ఫోమ్ డిటర్జెంట్ వాషింగ్ సోప్ పౌడరు మీరు అమ్ముతున్నారా?"

"అమ్ముతున్నాం, సార్."

"యువతులను వీధులమ్మట పంపించి అమ్ముతున్నారా"

జయరామ్ ఆశ్చర్యాన్ని ప్రకటించాడు.

"మా తరపున ఏ యువతులూ వీధులమ్మట తిరగటం లేదు. మేం షాపులకు విక్రయిస్తున్నాం," అన్నాడతను.

"ఏ యువతులూ మీ కంపెనీ తరపున పనిచేయడం లేదా?"

"లేదు సార్."

"మానుఫాక్చరర్ రఘురామ్ అండ్ కంపెనీ యువ తులను పంపుతుందేమో?"

"నో సార్. కర్ణాటకా, కేరళా, తమిల్‌నాడ్, ఆంధ్రాలకు మేము పంపిణీదార్లం. ఈ రాష్ట్రాల్లో మేమే అమ్మాలి. మాకు తెలియకుండా యేమీ జరగదు," అన్నాడు జయరామ్.

"మిస్టర్ జయరామ్, మీ ప్రోడక్ట్‌ని ఈ పట్నంలో యువతులు వీధులమ్మట తిరిగి అమ్ముతున్నారు. మీకంపెనీ తరఫున పనిచేస్తున్నామని వాళ్ళు చెప్తున్నారు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మా దేళ్ళ క్రితం అలా మేం అమ్మించాం. మా వాషింగ్ సోప్ పౌడర్‌కి చాలా డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం మేం అలా చెయ్యడంలేదు."

"థాంక్స్," అని శింగ్ రిసీవర్ని పెట్టేశాడు.

కుర్చీలో వెనక్కి వాలి ఆలోచిస్తూ శింగ్ సిగరెట్ వెలిగించాడు. ఒక విషయం తేటతెల్లగా తెలుస్తోంది. రఘు అండ్ కంపెనీ యువతులచేత యీ వాషింగ్ పౌడర్‌ని అమ్మించడంలేదు!

అయితే యీ వాషింగ్ పౌడర్‌ని ఎవరు అమ్ముతున్నారు? వాషింగ్ పౌడర్‌ని అమ్ముతున్నట్లు నటిస్తూ వాళ్ళు దొంగతనాలు చేస్తున్నారా? వాళ్ళకు వాషింగ్ పౌడర్ అమ్మటం ప్రధానం కాకపోవచ్చు! ఏదో అమ్ముతున్నట్లు నటిస్తేగాని వాళ్ళు యిళ్ళలోకి వెళ్ళలేరు. ఇన్‌స్పెక్టర్ శింగ్ చాలాసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు.

అరగంట తర్వాత అతడు మేలుకొన్నాడు, తన ఆలోచనల్లోంచి. ఇప్పుడతనికంతా అర్ధమయింది. తను తెలివిగా వాళ్ళను వలలో యిరికించి పట్టుకోవాలి!

అతడు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు ఫోన్ చేశాడు.

ఇటువంటి దొంగతనాలు మరేమైనా జరిగేయేమో అతడు తెల్సుకోవాలి!

8

రాజాచంద్ర యిచ్చిన వస్తువులను గురవయ్యశెట్టి చూశాడు.

"వీటి విలువ రెండు వేలుంటుంది. కాని ప్రస్తుతము నేను కొనలేను," అన్నాడతను.

రాజాచంద్రలో గాభరా పుట్టుకొచ్చింది. ఇన్ని వస్తువులనూ రహస్యంగా మరోచోటుకు మోసుకెళ్ళాలి. సాధారణంగా దొంగిలించిన వస్తువులను అమ్మేటప్పుడే దొంగ పట్టుబడ్తాడు!

"ఇంత హఠాత్తుగా కొననంటే ఎలాగ? నేను ఎక్కడికెళ్తాను."

గురవయ్యశెట్టి టీపాయిమీదున్న ప్లేటులోని ద్రాక్ష పళ్ళను తింటూ అతడివంక చూశాడు.

"దొంగ వస్తువులను కొనడం ప్రమాదంతో కూడినదని నీకు యింతకుముందే చెప్పాను. ఇన్స్పెక్టర్ శింగ్ నా దగ్గర కొచ్చాడు. రికో మిక్సర్ని ఎవరో దొంగిలించినట్లు రిపోర్టు వచ్చిందట. రికోమిక్సర్ రెండురోజులక్రితం నువ్వు నా కమ్మావు. గుర్తుందా?"

అతడు తలాడించాడు.

"పోలీసులు నీ కోసం వెతుకుతున్నారు. వాళ్ళ కళ్ళు నీమీద పడ్డాక నువ్వమ్మే వస్తువుల్ని ఎవ్వరూ కొనరు!"

రాజాచంద్ర ఆలోచించసాగాడు. ఇన్స్పెక్టర్ శింగ్ ఏం తెల్సుకున్నాడో కనుక్కోడం మంచిది.

"ఇన్స్పెక్టర్ శింగ్ ఎంతవరకు మా గురించి తెల్సు

కున్నాడు?"

"మీకు దగ్గరవుతున్నాడు. రేపో, మాపో అతడు నీకు ఎదురవ్వొచ్చు."

రాజాచంద్ర వులిక్కిపడ్డాడు. ఇంతవరకూ అంతా జయప్రదంగా సాగిపోతూంది. పట్టుబడనంతకాలం నేరస్తులు సుఖంగా జీవిస్తారు. పట్టుబడే స్థితి వచ్చేసరికి అల్లల్లాడి పోతారు!

రాజాచంద్ర బ్రతిమాలుతున్నట్లు అతడివైపు చూశాడు.

"ఈ ఒక్కపారి తెచ్చినవి కొనండి. ఇటుపైన రాను."

"మునుపటి రేటు ఇవ్వలేను."

"ఎంతిస్తారు?"

"పదోవంతు. నువ్వు యింటికి తెచ్చావని కొంటున్నాను. ఆ రేటు నీకు సమ్మతమైతే చెప్పు!"

తను తెచ్చిన వస్తువులను తీసుకొని బయటకు వెళ్ళే ధైర్యం లేదతనికి. ఇన్‌స్పెక్టర్ శింగ్ మనుషులు ఎక్కడేనా దాక్కొని వుండొచ్చు, తనకోసం!

"ఇవ్వండి" అన్నాడతను.

గురవయ్యశెట్టి రెండువందలు అతడికిచ్చాడు.

"ఈసారికి యిలా పోనీ! పరిస్థితులు విషమించాయి. ఈ దొంగతనాలు ఎలా చేస్తున్నారో, నీకు సహచరులు ఎందరున్నారో నాకు తెలియదు. ఇటుపైన నువ్వు చాలా జాగ్రత్తగా వుండాలి. ఇక్కడికొచ్చిన యిన్‌స్పెక్టర్ శింగ్‌ని బయటకు పంపేసరికి తలప్రాణం తోక్కి వచ్చింది."

"నేను యిక్కడ అమ్ముతున్నానని అతడికి తెల్సా?"

"తెలియదు, దొంగ వస్తువులు నేను కొంటానని

మార్కెట్‌లో పేరుందిగా! పెద్దపెట్టున దొంగతనాలు జరిగుతే నా దగ్గరకువచ్చి దర్యాప్తు చేస్తారు. వాళ్ళకు నా దగ్గర ఏ వస్తువులూ దొరకవు! వాళ్ళ కళ్ళల్లో కారం ఎలా కొట్టాలో నాకు తెలుసు" అన్నాడు శెట్టి.

రాజాచంద్ర గాభరాగా లేచాడు.

"నేను వెళ్తానండి."

"కొంతకాలం పోయాక పరిస్థితులు మారవచ్చు. నువ్వు యిప్పటిలాగే వచ్చి నన్ను చూడు. సమయం మంచిదైతే నీకు ఎక్కువరేటు నేను యివ్వొచ్చు" అన్నాడతను.

"చూస్తాను," అని రాజాచంద్ర బయటకు నడిచాడు.

తన మోటర్‌సైకిల్ పక్కన నిలబడి నలువైపులా చూశాడు. రోడ్డమ్మట ఎవరెవరో వెళుతున్నారు. వాళ్ళలో ఎవరయినా యిన్స్పెక్టర్ శింగ్ మనుషులు కావచ్చు. అతడి గుండె వేగంగా కొట్టుకుంటోంది.

అతడు మోటర్‌సైకిల్‌ని శరవేగంగా పోనిచ్చాడు.

9

రాజాచంద్ర బాగా బ్రాందీ సేవించి నిషాలో వున్నాడు. సిగరెట్ పీలుస్తూ వాళ్ళవంక చూశాడు. ఎదురుగా ఐదుగురు యువతులే వున్నారు.

"సుమతి రాలేదు!" అన్నాడతను.

"గతవారం రోజులుగా ఆమె రావటం లేదుగా!" అంది కమల.

"మనతో అబద్ధం చెప్పి తన వాటాకురావల్సిన డబ్బును పట్టుకుపోయింది. నన్ను మోసగించిన వాళ్ళను నేను మన్నించను!" అర్చాడతను.

అందరూ మౌనంగా వుండిపోయారు. రాజాచంద్ర

కళ్ళు ఎర్రగా వున్నాయి. ఈనాడు అతడినిచూస్తే అందరికీ భయంగా వుంది.

అతడు వాళ్ళవంక సూటిగా చూశాడు.

"మీకు నేను ప్రస్తుతం యెక్కువగా యివ్వలేను. ఈ మధ్య మనం దొంగిలించిన వస్తువులకు నాకు వెయ్యిరూపాయలు మాత్రం వచ్చింది. నా వాటాపోతే మీకు తలొక వందా వస్తుంది."

గాయత్రి గాయపడిన పులిలా లేచింది.

"వందరూపాయలా?" అర్చిందామె.

ఆమెవైపు అతడు సూటిగా చూశాడు.

"మనం చేసిన దొంగతనాల్ని గురించి పోలీసు రిపోర్టులివ్వబడ్డాయి. ఇన్ స్పెక్టర్ శింగ్ దర్యాప్తు చేస్తున్నాడు. గురవయ్యశెట్టి యింటిమీదకు అతడు దాడిచేశాడు. నేను పట్టుకెళ్ళిన వస్తువులను అతడు కొననన్నాడు. అతడిని బ్రతిమాలి చివరికి కొనిపించాను. పదోవంతు యిచ్చాడు. చాలా తక్కువని నాకు తెలుసు. మరేం గత్యంతరం లేక యిచ్చింది తీసుకుని తిరిగి వచ్చాను," అన్నాడు రాజాచంద్ర.

"నీతో పనిచెయ్యడం యిటుపైన వుపయోగపడదు!" అంది కమల.

"మీరందరూ నన్ను వదిలేస్తారా?" ప్రశ్నించాడతను.

"ఫలితం లేనప్పుడు పనిచేయడం దేనికి?" గాయత్రి అంది.

రాజాచంద్ర గ్లాసులో బ్రాందీ పోసుకుని హాట్ గా తాగేశాడు. మరో సిగరెట్ వెలిగించాడు.

"మీరు నన్ను వదలొద్దు. త్వరలో పరిస్థితులు బాగుపడ్తాయి."

"మేం ధనవంతులం కాము. అందుకే తెగించి నీతో పనిచేస్తున్నాం. పోలీసులకు మేం దొరికిపోవచ్చని ఒక వైపునుంచి భయం మమ్మల్ని పీడిస్తున్నా, మా ధైర్యాన్ని మేం కోల్పోలేదు. ఇన్‌స్పెక్టర్ రంగంలోకి దిగాడని విన్నాక మాకు భయంగా వుంది" అంది విమల.

తను తాగిన బ్రాందీ అతడికి ధైర్యాన్నిచ్చింది. తనతో పనిచేసే యువతులు భయపడకుండా చూడాలి! వాళ్ళు వుంటేగాని యీ దొంగతనాలను తను చేయించలేడు. వాళ్ళు తన్ని వదిలేస్తే తనకు ఆదాయం వుండదు.

"మీరు భయపడకండి. నేను గురవయ్యశెట్టితో మాట్లాడాను. అతనికి పోలీసు వాళ్ళందరూ తెలుసు. అతడు ఇన్‌స్పెక్టర్ శింగ్‌ను లొంగదీస్తాను అన్నాడు. ఇన్‌స్పెక్టర్ శింగ్ మన్ని ఏమీ చెయ్యడు. అతడికి ఇయ్యవలసింది గురవయ్యశెట్టి యిస్తాడు. మనపనికి భంగం కలగదు!"

"అలా అయితే ఫర్వాలేదు," అంది హేమ.

"కాని మనం చేసేదానిలో కొన్ని మార్పులను నేను తీసుకొస్తున్నాను. ఇటుపైన డిటర్జెంట్ సోప్ పౌడర్ మీరు అమ్మరు. తిలక్ అండ్ కంపెనీవారు వక్కపొడిని తయారు చేస్తున్నారు. ఇటుపైన మీరు వక్కపొడుంని అమ్మాలి. పోలీసులు డిటర్జెంట్ సోప్ పౌడర్ పాకెట్లు అమ్మేవాళ్ళకోసం చూస్తూవుంటారు. వక్కపొడుం అమ్మేవాళ్ళను వాళ్ళు పట్టుకోరు. ఆ కంపెనీవాళ్ళు యువతుల చేత వక్కపొడుం పాకెట్లు అమ్మిస్తోన్నారు. అది మనకు ఉపయోగపడుతుంది. ఎలావుంది నా ఐడియా?"

"ఫైన్," అంది కమల.

"మరొకటి. ఇంతవరకూ మీరు అమ్మిన ప్రదేశాలకు యిప్పుడు మీరు వెళ్ళరు. వేరే ప్రదేశాలకు మిమ్మల్ని పంపిస్తాను."

"నువ్వేం చెప్పినా మేం చేస్తాం. మాకు ప్రమాదం రాకుండా నువ్వు చూడాలి," అంది కమల.

"మీకు భయంలేదు. నేనున్నానుగా!" అన్నాడతను బ్రాందీ నిషాలో.

10

పోలీస్ డిపార్టుమెంటులో ఇన్‌స్పెక్టర్ శింగ్ చాలా తెలివైన యువకుడు. దేశం బాగా క్షేమంగా వుండాలని అతడి ఆశయం. డబ్బుకు లొంగేమనిషి కాడతను.

వైట్‌ఫోమ్ డిటర్జెంట్ వాషింగ్ సోప్ పౌడర్ పాకెట్లు అమ్మిన ప్రదేశాల్లో తిరగమని కొందరు మనుషులను అతడు నియమించాడు.

రోజల్లా అతడు తన కుర్చీలో కూర్చునే వుంటున్నాడు. తన మనుషులు అతడికి రిపోర్టులు పంపుతున్నారు. తను అనుకొన్న విధంగా ఏమీ జరగటంలేదు.

టెలిఫోన్ మ్రోగింది. అతడు రిసీవర్ని ఎత్తాడు.

"ఇన్‌స్పెక్టర్ శింగ్," అన్నాడతను.

"ముకుంద్ రిపోర్టింగ్ సార్."

"చెప్పు."

"ఈ ప్రదేశంలో డిటర్జెంట్ సోప్ పాకెట్లు అమ్మేవాళ్ళు నాకు కనిపించలేదు. ఇద్దరు యువతులు వక్కపొడుం పాకెట్లు అమ్ముతున్నారు."

ఇన్‌స్పెక్టర్ శింగ్ కుర్చీలోంచి తృళ్ళిపడ్డాడు.

"మిస్టర్ ముకుంద్! వక్కపొడుం పాకెట్లను అమ్మే

వాళ్ళను వెంటాడు" అన్నాడతను.

"అలాగే, సార్" అన్నాడు ముకుంద్.

ఇన్‌స్పెక్టర్ శింగ్ కుర్చీలో వెనక్కివాలి సిగరెట్ వెలిగించాడు. డిటర్జెంట్ సోప్ పాకెట్లు అమ్మేవాళ్ళ కోసం తను అన్వేషిస్తున్నట్లు వాళ్ళకు తెలిసి వుండొచ్చు. దొంగలముఠా ఇప్పుడు వక్కపొడుం పాకెట్లు అమ్ముతూ వుండొచ్చు!"

దొంగతనం చేసేవాళ్ళు పోలీసులు ఎలా వ్యవహరిస్తున్నదీ కనుక్కుంటారు. పోలీసులకు దొరకకుండా వుండేందుకు వాళ్ళ పద్ధతులను మార్చుకుంటారు! ఇన్‌స్పెక్టర్ శింగ్ జీవితంలో యిటువంటివి ఎన్నో చూశాడు.

ఒంటిగంట ప్రాంతంలో మళ్ళీ టెలిఫోన్ మోగింది. అతడు రిసీవర్ని యెత్తాడు.

"హలో, ఇన్‌స్పెక్టర్ శింగ్" అన్నాడతను.

"ముకుంద్, సార్," అంది అటువైపు కంఠం.

"చెప్పు!"

"ఇద్దరు యువతులను నేను ఆపుచేసి యిక్కడ వుంచాను. రాజా మెడికల్ స్టోర్స్, రామయ్యర్ వీధిలో నేను వున్నాను. మీరు వెంటనే యిక్కడకు రండి."

"వస్తున్నాను," అన్నాడు ఇన్‌స్పెక్టర్ శింగ్.

11

రాజా మెడికల్ స్టోర్స్ ముందు పోలీస్ జీప్ ఆగింది. ముకుంద్ షాపు బయట నిలబడి వున్నాడు. అతడి కెదురుగా కమల, విమల వున్నారు.

జీప్‌లోంచి దిగి ఇన్‌స్పెక్టర్ శింగ్ వాళ్ళ దగ్గరకు నడిచాడు. ఇద్దరు యువతులూ గాభరాగా అతడివైపు

చూశారు.

"ఇన్‌స్పెక్టర్ గారూ, యిది అన్యాయం. పొట్టకోసం గోడమ్మట తిరిగి మేం వక్కపొడుం పాకెట్లు అమ్ముకొంటుంటే, మమ్మల్నిలా ఆపి మా నోట్లో మట్టి కొట్టడం అన్యాయం" అర్చింది కమల.

"మీరు కంగారుపడకండి. మిమ్మల్ని వదలేస్తాం" అని యిన్‌స్పెక్టర్ శింగ్ ముకుంద్‌తో కొంచెం దూరంగా జరిగాడు.

ముకుంద్ వైపు అతడు చూశాడు.

"నువ్వు యీ ప్రదేశాని కెందుకొచ్చావు?" ప్రశ్నించాడు.

"మీరు నన్ను తిరగమన్న ప్రదేశాల్లో ఎవ్వరూ కనపడలేదు. అందుకని యిలా వచ్చాను" అన్నాడు ముకుంద్.

"వాళ్ళ బ్యాగ్‌లో ఏవేనా వస్తువులున్నాయా?"

"బాగ్స్‌లో వక్కపొడుం పాకెట్లు తప్ప మరేమీ లేవు."

ఇన్‌స్పెక్టర్ ఆలోచిస్తూ క్షణకాలం వుండిపోయాడు.

"ముకుంద్, వాళ్ళ బాగ్స్‌లో వున్న ఒక పాకెట్ ఇలా పట్రా."

ముకుంద్ వాళ్ళ దగ్గరకు వెళ్ళి పాకెట్‌తో తిరిగి వచ్చాడు.

పాకెట్‌ను యిన్‌స్పెక్టర్ పరీక్షించాడు. తిలక్ అండ్ కంపెనీ వక్కపొడాన్ని తయారుచేస్తోంది. ఇన్‌స్పెక్టర్ పాకెట్‌ను యిచ్చేశాడు.

"ముకుంద్, వాళ్ళతో నువ్వు మాట్లాడుతూ వుండు!" అని అతడు పెద్ద అంగల్లో రాజా మెడికల్ స్టోర్స్ లోపలకు వెళ్ళాడు.

టెలిఫోన్ డైరక్టరీ చూసి తిలక్ అండ్ కంపెనీ నంబర్ను డయల్ చేశాడు.

"తిలక్ అండ్ కంపెనీ, సార్" అందో కంఠం అటు వైపునుంచి.

"ఇన్‌స్పెక్టర్ శింగ్ స్పీకింగ్, మీ యజమానితో మాట్లాడాలి?"

"వుండండి."

అటువైపునుంచి ఒక స్త్రీ కంఠం వినపడింది.

"హలో సార్, నా పేరు రాజమ్మ. ఈ కంపెనీ నాదే."

"యువతులను వీధులమ్మట తిప్పి మీరు వక్క-పొడుం పాకెట్లు అమ్మిస్తున్నారా?"

"అమ్మిస్తున్నాం సార్. మాది కొత్త కంపెనీ. అలా ప్రచారం చేస్తేగాని మా వక్క-పొడుం పాప్యులర్ కాదు."

"ఎంతమంది యువతులు పని చేస్తున్నారు?"

"ఇరవైమంది. వాళ్ళందర్కీ అమ్మకాన్ని బట్టి కమీషన్ యిస్తాం."

ఇన్‌స్పెక్టర్ శింగ్ ఆలోచిస్తూ వుండిపోయాడు. ఆమెను క్షణం వుండమని అతడు బయటకు పరుగెత్తాడు. ఆ యువతులతో మాట్లాడివెళ్ళి రిసీవర్ని అందుకున్నాడు.

"మీ తరఫున పనిచేసే వందమందిలో కమల, విమల వున్నారా?" అడిగాడతను.

"కాస్సేపాగండి, లిస్టుచూసి చెప్తాను" అందామె.

"ఆ పేర్లతో ఎవ్వరూ లేరు!" అందామె, కొంత సేపయ్యాక.

"థాంక్స్" అని యిన్‌స్పెక్టర్ శింగ్ రిసీవర్ని పెట్టేశాడు.

టేబుల్ మీద యీ ఫైపైసలు పడేశాడు.

"ఫోన్ కాల్‌కి డబ్బు వద్దుసార్" అన్నాడు షాపు యజమాని.

"డబ్బివ్వకుండా నేను ఎన్నడూ ఫోన్ చేయను" అని యిన్‌స్పెక్టర్ శింగ్ బయటకు నడిచాడు.

వాళ్ళిద్దరి దగ్గరకూ వెళ్ళాడు శింగ్.

"జీప్‌లో కూర్చోండి" అన్నాడతను.

గుండెదడతో వాళ్ళు జీప్‌లో కూర్చున్నారు. జీప్ కదిలింది.

ఇన్‌స్పెక్టర్ శింగ్ వాళ్ళవంక చూశాడు.

"మీరు ఎవరి తరఫున వక్కపొడుం పాకెట్లు అమ్ముతున్నారు?"

"తిలక్ ఆండ్ కంపెనీ" అంది కమల.

"ఆ కంపెనీకి ఫోన్ చేసి మాట్లాడాను" అన్నాడు శింగ్.

కమల వులిక్కిపడింది. విమల భయంతో అర్చింది.

"ఇంతకు ముందు డిటర్జెంట్ సోప్ పౌడరు పాకెట్లు అమ్మేవారా?"

"లేదు సార్. మేం వక్కపొడుం అమ్ముతున్నాం" అంది కమల.

జీప్ డ్రయివర్తో ఏదో చెప్పాడు యిన్‌స్పెక్టర్. కాస్సేపట్లో కమలాకర్ యింటిముందు జీప్ ఆగింది.

వీధి తలుపు తెరిచే వుంది. మధుమతి గుమ్మంలో నిలబడి వుంది.

"సుబ్బాయమ్మగార్ని ఒకసారి బయటకు రమ్మనండి!" అన్నాడు శింగ్.

మధుమతి లోపలకు వెళ్ళింది. సుబ్బాయమ్మతో ఆమె తిరిగి వచ్చింది.

"జీప్‌లో వున్న ఆ యువతులవైపు చూడండి!" అన్నాడు శింగ్.

కొంచెం ముందుకెళ్ళి సుబ్బాయమ్మ యువతుల వంక చూసింది. "దొంగముండలు, వాళ్ళే!" అర్చిందామె.

తటాలున ఇన్‌స్పెక్టర్ శింగ్ జీప్‌లో కూర్చున్నాడు. జీప్ కదిలింది. ఇన్‌స్పెక్టర్ శింగ్ వాళ్ళవైపు సూటిగా చూశాడు.

"ఇహ మీరు అబద్ధం ఆడి లాభంలేదు. నిజం చెప్పండి!" గర్జించాడతను.

విమల ఏడ్వసాగింది.

"మాకేం తెలియదు సార్. ఆ రాజాచంద్రగాడు మిమ్మల్ని పనిలోకి దింపాడు."

"ఆతడు ఎక్కడుంటాడు?"

"ఇల్లు చూపిస్తాం, పదండి" అంది కమల.

ఇన్‌స్పెక్టర్ శింగ్ విజయవంతంగా సిగరెట్ వెలిగించాడు. జీప్ రోడ్డమ్మట వేగంగా పోసుకుపోయింది.

"ఆ యిల్లే!" అర్చింది కమల, మోటర్ సైకిల్ బయట నున్న యిల్లు చూపిస్తూ.

12

జీప్ ఆగింది. ఇన్‌స్పెక్టర్ శింగ్, ముకుంద్ కిందకు దిగారు. ముందా తలుపుమీద తట్టారు.

తలుపు తెరిచి మంగమ్మ భయంతో యిన్‌స్పెక్టర్ వైపు చూసింది.

"ఏం కావాలి?" ప్రశ్నించిందామె.

"రాజాచంద్ర కావాలి" అన్నాడు యిన్‌స్పెక్టర్ శింగ్.

"మా అబ్బాయి ఏదేనా నేరం చేశాడా?" అడిగింది మంగమ్మ.

క్షణకాలం యిన్‌స్పెక్టర్ శింగ్ ఆమెవైపు చూశాడు. అమాయకపు స్త్రీ. ఆమెను చూస్తే అతడికి జాలివేసింది.

"అతడితో మాట్లాడాలమ్మా" అన్నాడతను.

"అబ్బాయి ఆ గదిలో వున్నాడు" అందామె.

ఇన్‌స్పెక్టర్ శింగ్ లోపలకు వెళ్ళాడు. కుడివైపున్న గది తలుపు మూసి వుంది. తలుపుతోసి అతడు లోపలకు వెళ్ళాడు.

రాజాచంద్ర చాపమీద బాగా తాగి పడివున్నాడు. పక్కనే మెక్‌డోవెల్స్ బ్రాందీబాటిల్ వుంది.

ఇన్‌స్పెక్టర్ శింగ్, ముకుంద్ గదంతా వెతికారు. దొంగిలించిన కొన్ని వస్తువులు వాళ్ళకు దొరికాయి.

"ముకుంద్, యితడిని యిలాగే పోలీస్ స్టేషన్‌కి చేర్చాలి" అన్నాడు శింగ్.

ఇద్దరు కానిస్టేబుల్స్ గదిలో కొచ్చి రాజాచంద్రను మోసుకుపోయి జీప్‌లో పడేశారు.

ఇన్‌స్పెక్టర్ శింగ్, ముకుంద్ గదిలోంచి బయటకు వచ్చారు. తలుపు మూసి యిన్‌స్పెక్టర్ తాళంవేశాడు.

ముందు హాల్లో నేలమీద కూర్చుని మంగమ్మ వెక్కి, వెక్కి ఏడుస్తోంది. ఆమె వంక జాలిగా చుశాడు యిన్‌స్పెక్టర్ శింగ్.

"ఒక్కోసారి యింటికి అపకీర్తి తెచ్చేవాళ్ళు కుటుంబంలో పుడ్తూ వుంటారు. అది విధమ్మా, ఏడ్చి లాభం లేదు" అని యిన్‌స్పెక్టర్ శింగ్ బయటకు నడిచాడు.

——:ఐపోయింది:——